


## 2.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రస్తుత 2024-25 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు నిర్దేశించిన 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణలో ఇప్పటి వరకూ 2.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 29,101 మంది రైతుల నుంచి 2.32 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ చేసి, రూ.488 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లో సొమ్ము జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకూ 94 శాతం కోతలు పూర్తి అయినట్లు ఆయన ప్రకటనలో తెలిపారు.

# రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న కేంద్రం

- జమిలికి సిపిఎం పూర్తి వ్యతిరేకం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభ ప్రారంభం



ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రంలోని బిజెపి సర్కారు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని, రాష్ట్రాల హక్కులను హరించేస్తుందని, మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ అన్నారు. సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తొలి మహాసభ అమలాపురం ప్రెస్‌క్లబ్ లోని పచ్చిమాల వసంతకుమార్ నగర్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలుత సిపిఎం పతాకాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు పీతల రామచంద్రరావు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పచ్చిమాల వసంతకుమార్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాతర ఎన్.బలరామ్, కె.కృష్ణవేణి, బివి.రాఘవులు అధ్యక్షవర్గంగా ప్రతినిధుల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ ప్రారంభోపన్యాసం చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈ విధానాలను ప్రతిఘటించాలన్నారు.

జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారా బిజెపి అజెండాను రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్ని తాకే స్థాయిలో ఉన్నాయన్నారు. కేరళ తరహాలో 13 రకాలు వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం అధికంగా ఉందన్నారు. ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులన్నీ అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలను కేంద్రం తెరపైకి తెచ్చిందన్నారు. దీనికి సిపిఎం పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం ప్రజలు ఉపయోగించే వస్తువులపై జిఎస్‌టి భారాన్ని మోపుతుందన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. విభజన హామీలను పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. పోలవరం నిర్వాసితులను గాలికొదిలేసిందన్నారు. రాజధాని నిర్మాణానికి పట్టెడు మట్టితో సరిపెట్టిందని విమర్శించారు. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి ద్రోహం తలపెట్టిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తుందని, అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు.

అనంతరం సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మూడేళ్ల నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో వరదలు సంభవించిన సమయంలో పార్టీ తరపున అనేక మందిని ఆదుకున్నామని తెలిపారు. అంగన్‌వాడీలు సుదీర్ఘకాలం సమ్మె చేశారన్నారు. ప్రజా గర్జన, ప్రజా పోరు, ఇంటింటికీ సిపిఎం వంటి కార్యక్రమాలతో ప్రజా సమస్యలపై పోరాడమన్నారు. బుధవారంతో మహాసభ ముగుస్తుందన్నారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకుల ఆంధ్ర మాల్యాద్రి, జిల్లా నాయకులు జి.దుర్గాప్రసాద్, నాగవరలక్ష్మి, డాక్టర్ చల్లా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏచూరికి నివాళులర్పిస్తూ...



ప్రారంభోపన్యాసం చేస్తున్న సుబ్బరావమ్మ



అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీతల రామచంద్రరావు



అర్జీలు స్వీకరిస్తున్న శంకర్‌నాయక్

## ఎస్‌టిల అభివృద్ధికి కృషి

### ఎస్‌టి కమిషన్ సభ్యులు వదిత్యా శంకర్‌నాయక్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎస్‌టిల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎస్‌టి కమిషన్ సభ్యులు వదిత్యా శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఎస్‌టిల నుంచి ఆయన మంగళవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక కాలంలోనూ ఎస్‌టిలు వెనుకబడి ఉన్నారన్నారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనం గురించి తెలియచేయాలన్నారు. వాటికి సంబంధించి క్షేత్ర స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చాగల్లు మండలం మీనా నగరం, తాళ్లపూడి మండల పరిధిలోని తుపాకుల గూడెం తదితర ప్రాంతాల్లో అధికారులు వ్యక్తిగతంగా పర్యటించి ఆయా కుటుంబాలు ఎన్ని ఉన్నాయి, జనాభా, ప్రభుత్వ పరంగా అందుకుంటున్న పథకాల వివరాలు సేకరించాలన్నారు. కొన్ని కుటుంబాలకు ఆధార్ కార్డు లేకపోవడం, బడికి వెళ్లే పిల్లలకి అందించే ప్రోత్సాహకాలు అందక పోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం చేకూర్చక పోవడం వంటివి జరుగుతున్నాయన్నారు. సమగ్ర సర్వే చేపడితే వారికి ప్రభుత్వ పరంగా చేయూత నివ్వడం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చాగల్లు మండలం మీనా నగరానికి చెందిన ఆవాల కోటయ్య అర్జీని అందించారు. చెంచు తెగలకు చెందిన 16 కుటుంబాలు ఇదే గ్రామంలో నివసిస్తున్నామన్నారు. చెరువులపై తమకు అవకాశం కల్పించాలని కోరారు. సర్వే నిర్వహించి, అన్నీ విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తాళ్లపూడి మండలం తుపాకుల గూడెంలో సాగు చేసుకుంటున్న భూములపై సాగు హక్కు కల్పించాలని అర్జీ ఇచ్చారు. గ్రామ పరిధిలోని చెరువుల్లో చేపల పెంచేందుకు హక్కులు కల్పించాలని, ఆధార్ కార్డులు అందించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింప జేయాలని పలువురు అర్జీలు ఇచ్చారు. రాజమండ్రికి చెందిన దేవర రాజేష్ ఉద్యోగం ఇప్పించాలని అర్జీ అందించారు. తమ స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకుని సాగు చేస్తున్నారని, ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని రంపచోడవరానికి చెందిన బి.శ్రీదేవి అర్జీ అందించారు.

## రెవెన్యూ సదస్సుల్లో 95 అర్జీల పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో ఇప్పటి వరకూ జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 95 అర్జీలను పరిష్కరించామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. డిసెంబర్ 12 నుంచి జనవరి 8వరకూ ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఆ మేరకు తహాశీల్దార్లు ఆయా రెవిన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సభల షెడ్యూల్‌ను పంచాయతీ కార్యాలయం, గ్రామ సచివాలయం వద్ద ప్రదర్శించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 70 గ్రామ పంచాయతీల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. 742 అర్జీలను స్వీకరించి 95 పరిష్కరించామన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 348 అర్జీలు, రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 394 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి అధికారి జవాబుదారీతనం కలిగి ఉండేలా అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజక వర్గంలో ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను పర్యవేక్షణాధికారిగా నియమించామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం ఊనగట్లలో 33/11కెవి సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తము ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2. గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని 11 కెవి ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామన్నారు. ఊనగట్ల, ఎస్.ముప్పవరం, నందిగంపాడు, కుంకుడుమిల్లికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఊనగట్ల వ్యవసాయ ఫీడర్లకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. అగ్రికల్చరల్ ఫీడర్‌కి ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

## ఉద్భవ్ -2025 వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్-2025 వెబ్‌సైట్ గురువారం అధికారికంగా ప్రారంభమైంది. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర దీన్ని ప్రారం భించారు. విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి, ఇతర కార్యకలాపాలకు ఈ వెబ్ సైట్ వేదికా నిలుస్తుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ యువజనోత్సవంగా ఊహించబడిన ఉద్భవ్ 2025, దేశ వ్యాప్తంగా విద్యార్థులను ఒకచోట చేర్చి వారి ప్రతిభ, సృజనాత్మకత, ఆవిష్కరణలను సాంస్కృతిక, విద్యా మరియు సహపాఠ్య కార్యక్రమాల ద్వారా ఘనంగా వేడుకగా జరుపుకోనుంది. ఇందులో 4 ఆన్‌లైన్ మరి ఆర ఆఫ్‌లైన్ పోటీలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు www.gcrjy.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

# పెన్షన్ బిక్ష కాదు ప్రాథమిక హక్కు

## జిల్లాలో ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పెన్షన్ బిక్ష కాదని, అది ప్రాథమిక హక్కు అని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం పెన్షనర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సమస్యలపై రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లో పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్.మూర్తి, కెఎస్‌వి.రామచంద్రరావు మాట్లాడారు. 1982 డిసెంబర్ 17న సుప్రీమ్ కోర్టు పెన్షన్ ప్రాథమిక హక్కు అని తీర్పునిచ్చిందన్నారు. 1995లో కార్మికులకు కూడా ఇపిఎస్ 95 పేరుతో కేంద్ర ప్రభుత్వం పింఛనును తీసుకొచ్చిందన్నారు. కార్మికుడి చివరి నెల జీతం ఆధారంగా పెన్షన్ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా అమలు చేయకుండా ద్రోహం చేస్తుందన్నారు. కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని, కరువు భత్యం అమలు చేయాలని, రైల్వేలో రాయితీ ఇవ్వాలని, వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ కొన్నేళ్లుగా పెన్షనర్లు పోరాడుతున్నారన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు మొండి చేయే చూపుతుందన్నారు. ఇప్పటికైనా వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సోమేశ్వరరావు, సిహెచ్.మోహనరావు, టిఎస్.ప్రభాకర్, డి.అప్పారావు, జివి.నాగేశ్వరరావు కెవి.నాగేశ్వరరావు, కోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లపూడి :** విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల జీవి తాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి డిఎస్ నకారా అని సిపిఎస్ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు..

**గోపాలపురం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు అందరూ సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవనం గడపడం వెనుక ధరం స్వరూప్ నకారా చేసిన కృషి వెలకట్టనేలేదని గోపాలపురం మండలం రిటైర్డ్ పెన్షనర్స్ సభ్యులు అన్నారు. మంగళవారం పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి నకారా అన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు చెల్లించాలని, 11వ పిఆర్‌సి ఎరియర్స్ చెల్లించాలని, ఎడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పాత పద్ధతిని అమలు చేయాలని పెన్షనర్లు కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఎం.సుదర్శన్, వైస్ ప్రెసిడెంట్ కె.చంద్రయ్య, సిహెచ్.భాస్కరరావు, ఆర్.రత్న భాస్కరరావు, దున్న రాజబాబు, డి.భాస్కరరావు, జె.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

**కోరుకొండ :** కోరుకొండ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని పెన్షనర్స్ కార్యాలయం వద్ద మంగళవారం పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు. పెన్షనర్లు గౌరవ ప్రదమైన జీవనం సాగిస్తున్నారంటే నకరా పోరాటం వల్లేనన్నారు. ఈ సందర్భంగా 75 వసంతాలు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఒ ఆర్.రజని, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, సంఘం ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభుదాస్, కార్యదర్శి ఎస్ఎల్ఎన్ హ్యూమర్, కోశాధికారి పి.నాగేశ్వర రావు, జనసేన నాయకులు కర్రి గణేష్ పాల్గొన్నారు,



నూతన కమిటీ ఇదే...

## ఎస్ఎఫ్ఐ ఆర్ట్స్ కళాశాల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఎస్ఎఫ్ఐ ఆర్ట్స్ కళాశాల నూతన కమిటీ 16 మందితో ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.శివబాలాజీ, కె.సురేష్ ఎన్నికయ్యారు. ఆర్ట్స్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజు మాట్లాడుతూ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఆర్ట్స్ కళాశాలలో నూతన గదుల నిర్మాణానికి, అధ్యాపకుల నియమించాలని, రెండు పూటలా తరగతులు నిర్వహించాలని, ఆర్ట్స్ కళాశాలలో నిర్వహణ మెరుగు పరచాలన్నారు. వీటి పరిష్కారానికి, హనర్స్ డిగ్రీ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాన్ని నిర్మించాలన్నారు. నూతన కమిటీ సభ్యులుగా చక్రి, మౌళి, చిన్ని, వంశీ, తరుణ్, వెంకట్, గౌతమ్, జక్కయ్య, తేజ, నాని, కనక,జానకి, పవన్, కళ్యాణ్ ఎన్నికయ్యారు.

## డిసి చైర్మన్‌గా 'బూరుగుపల్లి'

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి మండలం ఎని మిది నీటి తీరువా సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా బూరుగు పల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా నల్లా భాస్కరరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆర్‌డిఒ సుస్మిత, తహశీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పలువురు నీటి సంఘం అధ్యక్షులు నల్లా సురేంద్ర, ఎం.భాస్కరరావు, ఎన్.వెంకటేశ్వరరావు, జి.పట్టాభిరామం, ఎ.శ్రీరామ్‌మూర్తి, టి.వెంకటసత్యారామదాసు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



డిసి చైర్మన్ శ్రీనివాస్, ఆర్‌డిఒ తదితరులు

## ఆయిల్ పామ్ రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంప యర్రంపాలెంలో ఆయిల్ పామ్ రైతులకు మంగళవారం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పతంజలి సంస్థ డిజిఎం ఎఎస్.ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయిల్ పామ్‌కు కేంద్ర ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. ఆయిల్ పామ్ తోటల ప్రాముఖ్యత, రైతులకు కంపెనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, సాగులో విజయం సాధించిన రైతుల విజయ గాదల గురించి వివరించారు. ఆయిల్‌పామ్ టన్నుకు రూ.20,240 ధర ఉందన్నారు. హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ అధికారి సౌమ్యాత్రి మాట్లాడుతూ పామ్ ఆయిల్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సూక్ష్మ సేద్యంలో ఇస్తున్న రాయితీలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ డిఎన్.శ్రీనివాస్, టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్ కె.కార్తీక్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావు, ఫీల్డ్ సూపర్‌వైజర ఎస్.శివ, సాయిరాం, డ్రిప్ ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

మండలం ఖండవల్లి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు మంగళవారం పంపిణీ చేశారు కూనపరెడ్డి కష్ణకుమార్ రూ.1,28,500, కత్తుల శ్రీలక్ష్మికి రూ.68,100, కేతా సత్యవతికి రూ.48,400, తానేటి ప్రసాద్‌కు రూ.42,700, బొల్లం రాధకు రూ.37,159, అనుకుల సాయి సతీష్‌కు రూ.32,100లకు మొత్తంగా రూ.3,56,959 విలువ చేసే చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 'పుష్కర' డిసి ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - కోరుకొండ


పుష్కర కాలువ సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. కోరుకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. పుష్కర కాలువ 6 డివిజన్‌లకు సంబంధించి నూతనంగా ఎన్నికైన ఆరుగురు కెనాల్స్ అధ్యక్షులకు జరిగిన ఎన్నికలలో పుష్కర కాలువ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షునిగా అడబాల వీరవెంకటసత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా అడపా వీరబాబు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి రాధిక తెలిపారు. ఈ సందర్భంగా వారిని కూటమి నాయకులు అభినందించారు.



## పాడి పరిశ్రమపై అవగాహన కల్పించాలి

**నల్లజర్ల :** సరైన ప్రణాళిక ద్వారా పశుపోషణ రైతులకు ఎంతో మేలుదాయకమని ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి పరిధిలో కృష్ణ మిల్క్ యూనియన్‌కు పాలు పోసే రైతులతో మంగళవారం అల్లాడ రామయ్య కళ్యాణ మండపంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గంట నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ యూనియన్ పాడి రైతుల అభ్యున్నతికి పాల ఉత్పత్తి పెంచేందుకు అనేక రాయితీలు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. అత్యధిక పాల ధర అందిస్తున్న సంస్థ కేవలం తమదేనన్నారు. అనంతరం అత్యధిక పాలు పోసిన రైతులకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పి.వీరరాఘవులు, ఎన్.రామకృష్ణ, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## కార్టూ'నిజం'



## ఘనంగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల పుట్టినరోజు

ప్రజాశక్తి - చాగల్లు

ఆంధ్ర ప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల పుట్టినరోజును మంగళవారం చాగల్లులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొనిగే రాంబాబు, పి.కిషోర్, రిక్షా కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిడదవోలు :** నిడదవోలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడవరపు భద్రం దొర అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. అనంతరం భద్రందొర మాట్లాడారు. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిల అవుతారన్నారు. రాష్ట్రాన్ని గత వైసిపి ప్రభుత్వం సర్వనాశనం చేసిందని, ప్రస్తు కూటమి ప్రభుత్వమూ అదే బాటలో పయనిస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక హోదా రావాలన్నారు. అది ఒక్క కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, కో-ఆర్డినేటర్ కారింకి వెంకటేశ్వరరావు, షేక్ ఖాసీమ్, శారద, షేక్ చిన్న జలానీ, జివి.సత్యనారాయణ, గుర్రం రమేష్ , వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




నిడదవోలులో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

## స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - బిక్కవోలు

ఇల్లపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో 90 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను వేట్లపాలెం గ్రామానికి చెందిన శ్రీరామకృష్ణ సేవ సమితి వారు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రామకృష్ణ సేవా సమితి వారు విద్యార్థులకు, సమాజంలోని పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు మాసిన కామరాజు, మోరంపూడి సత్యనారాయణ, దేసిన సత్తిబాబు, మాసిన రామసాయి, పుట్టా సుబ్బారావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ తమలంపూడి ఈశ్వరరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ తణుకు వీరవెంకట రమణ, వైస్ చైర్మన్ గుర్రాల సత్యవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నేరాలు ఘోరాలు

### చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మామిడి చెట్టుకు మందు కొట్టడానికి ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందారు. మంగళవారం మండలంలోని కొండవరం గ్రామానికి చెందిన బుర్ర బాపన్న (35) మామిడి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారని బంధువులు తెలిపారు. మృతుడు పుట్టుకతోనే మూగ అని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ యజమాని మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

### పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం త్రి రోడ్ సెంటర్ లో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో తరలిస్తున్న 8 బస్తాలు 29 వందల కేజీల పిడిఎస్ బియ్యాన్ని ఎస్ఐ శివకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మామిడికుదురు నుంచి రావులపాలెం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

### బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది, ఇఎస్‌టిఎఫ్, కాకినాడ ఎస్‌హెచ్ఒ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 2800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. పెద్దాపురం మండలం మరలావ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్లు, కాంద్రకోట గ్రామంలో 600 లీటర్లు, కట్టమూరు గ్రామంలో 1600 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ లక్ష్మీతులసి, ఇఎస్‌టిఎఫ్ సిఐ జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

### కాళ్లు, చేతులు కట్టేసి చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం దుబచర్ల గ్రామంలో స్థానిక వేపచెట్టు వీధిలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి యజమాని కాళ్లు చేతులు కట్టేసి మూడు కాసులు బంగారం, రూ.30 వేల నగదును చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దూబచర్లలో రిటైర్డ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్. చీమకుర్తి భాస్కర వీరభద్ర వెంకటఅప్పలకృష్ణమూర్తి భార్య లక్ష్మీకుమారితో కలిసి నివశిస్తున్నాడు. కష్ణమూర్తి భార్య అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. సోమవారం రాత్రి వారు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోనికి చొరబడి నిద్రిస్తున్న కృష్ణమూర్తిని, పనిమనిషి జుత్తిగ పెద్దింట్లను కాళ్ళ చేతులు తాళ్లతో కట్టి బంధించారు. ఇంట్లో ఉన్న మూడు కాసుల బంగారం, రూ.30 వేల నగదుకు అపహరించుకుపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో ఐజి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎఎస్‌పి సుబ్బరాజు సిఐలు ఎన్.శ్రీనివాస్, నాగేశ్వర నాయక్, క్రైమ్ సిఐ రాంబాబు, ఎస్ఐలు రవీంద్ర, బాలాజీ, రమేష్ ఇతర సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించిరు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

### హత్య కేసులో జీవితఖైదు

ప్రజాశక్తి- కడియం

కడియం పోలీసుస్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నేరం రుజువు కావడంత నిందితునికి యావజ్జీవ ఖైదు పడిందని సిఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. పితాని సత్తిబాబు కడియం మండలం వేమగిరితోటకు చెందిన బొంత వెంకన్నను హత్య చేసిన కేసులో నిందితునిగా ఉన్నాడు. రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టులో ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు జరిగాయి. నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.మాధురి తీర్పునిచ్చారన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 9 నెలలు జైలు శిక్షను విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పిపి పివివిఎస్‌బి.రాజు వాదనలు వినిపించారు. కడియం సిఐ పర్యవేక్షణలో సాక్షలను కోర్టులో ప్రవేశపెట్టారు.

### సత్యభాస్కర్‌కి ఉత్తమ రైతు అవార్డు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు మాజేటి సత్యభాస్కర్ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయ, అనుబంధ రంగ విభాగాల్లో ప్రతి ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏరువాక ఫౌండేషన్ ప్రతి సంవత్సరం వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రకటిస్తుంది. ఇందులోభాగంగా ప్రముఖ వ్యాపారవేత్త మాజేటి సత్యభాస్కర్‌ని ఉత్తమ రైతుగా గుర్తించి వరి సాగు పంటకు సంబంధించి ఆయనకు ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు యానాంలోనూ, తాళ్ళరేవు మండలం సుంకరపాలెంలో గల వ్యవసాయ భూములలో సాగుపై మక్కువతో తాను ఎక్కువగా వ్యవసాయం, వరిలో అధికదిగుబడుల సాధనతో పాటు విత్తనోత్పత్తిలో కృషి చేస్తున్నట్లు చెప్పారు. యానాం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, పుదుచ్చేరి రాష్ట్ర అగ్రికల్చర్ హైలెవిల్ కమీటీ సభ్యునిగా, స్టేట్ లెవిల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆన్ క్రాప్ ఇన్సూరెన్స్ (ఎస్‌ఎల్ సిఐ) సభ్యుడిగా పని చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో విజయవాడలో జరగబోయే అవార్డులు పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ సేవా పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వ్యవసాయ రంగ ప్రముఖులు, రైతులు, స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

### నేడు అభా కార్డు నమోదు కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డును తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యశాఖ అధికారి టి.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్డు చేయించుకునేవారు తమ వెంట ఆధార్ కార్డుకు లింకు కలిగిన మొబైల్ ఫోన్ తీసుకురావాలని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై 2వ బ్యాచ్ శిక్షణను మంగళవారం నిర్వహించారు. ఎంపిపి కెవికె.దుర్గారావు ఈ శిక్షణను ప్రారంభించారు. ఎంపిడిఒ ఎస్.వేణుగోపాలరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పావర్టీ ఫ్రీ విలేజ్, ఆరోగ్యవంతమైన గ్రామాలు, గ్రామాల్లో నీటి సమృద్ధి మార్గాలు, శానిటేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**చాగల్లు:** మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండవ బ్యాచ్‌కు మంగళవారం శిక్షణ జరిగిందని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. డిపిఆర్‌సి జిల్లా ట్రైనింగ్ ఆఫీసర్ జి.ప్రసంగిరాజు పాల్గొన్నారు. సభ్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఇఒ శుభాకర్, ఎపిఎం ఇ.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.తిలక్, ఎంపిహెచ్ఒ శాస్త్రి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాముఖ్యత, వాటి సాధనకు అవసరమైన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సర్వేయర్స్, మహిళా పోలీసులు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.



గోకవరంలో శిక్షణ తరగతులకు హాజరైన వివిధ శాఖల సిబ్బంది

**గోకవరం :** గోకవరం వెలుగు కార్యాలయం, సచివాలయం-4లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం మొదటి రోజు శిక్షణ ఎంపిడిఒ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు పాల్గొని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయంత్‌రాజు, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, ఎపిఒ పిఎస్.అప్పలరాజు, పిహెచ్‌సి విస్తరణ అధికారి డిఎన్.మూర్తి ఎసిడిపిఒ పి.వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

**ఉండ్రాజవరం :** మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధిలక్ష్యాలపై శిక్షణను నిర్వహించారు. ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి జిల్లా స్థాయి ట్రైనర్ ప్రసంగి రాజు, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి డికె.ఆంజనేయ శర్మ, సిహెచ్ఒ, ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఆర్.దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

**సీతానగరం :** మంగళవారం సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ భారతి ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెవిఎస్ఎస్ఎస్.మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వివిఎస్.ప్రకాష్, ఎపిఒ నాగశేషవేణి, ఎపిఎం ఎమ్‌డి.జిలాని, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజు, ఎంఒటిలు పాల్గొన్నారు.

# వికలాంగుల భద్రతకు ప్రభుత్వం చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వికలాంగుల భద్రతకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక గేదెల నూకరాజు కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వికలాంగులకు సామాజిక భద్రత పెన్షన్ కింద ఇంటి వద్దనే రూ.6 వేలు పింఛను అందిస్తుందన్నారు. పూర్తిగా మంచనానికి పరిమితమైన వారికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి రూ.15 వేలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరిస్తున్నామన్నారు. మంచానికే పరిమితం అయిన వికలాంగులు తరుపున కుటుంబ సభ్యులు హాజరై అర్జీ అందించొచ్చన్నారు. వికలాంగులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.

సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి అధికారంలోకొచ్చిన తర్వాత 40 నుంచి 80 శాతం వరకు అంగవైకల్యం ఉన్నవారికి రూ.6వేలు, 80 శాతం ఉన్న వారికి రూ.15 వేలకు పెంచి పింఛను అందిస్తుందన్నారు. అర్హులైన వారందరికీ సదరన్ సర్టిఫికెట్స్ అందిస్తున్నామనాఌ.గత ప్రభుత్వం జియోన్ సంస్థకు సంబంధించి దివ్యాంగులు ఆశ్రయాన్ని ఖాళీ చేయించడం అన్యాయమన్నారు. వారికి కలెక్టర్ తగు న్యాయం చేయాలని కోరారు. రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులు వారికాళ్లపై వారే నిలబడేలా చేయూతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా కన్నా ఫౌండేషన్ విద్యార్థి నత్య ప్రదర్శన, ధవళేశ్వరం పలుకు సంకల్ప పాఠశాల నత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ, వికలాంగుల శాఖ ఇన్‌ఛార్జి ఎడి, పి.కొండలరావు, రాయుడు సతీష్, కె.గోవింద్, ఎం.పాపిరెడ్డి, ఎం.పోసికుమార్, కిరణ్,. రజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 'నమో అదానీ - కరెంటు కహానీ' బుక్‌లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

పెరుగుతున్న విద్యుత్ భారాలకు కారణాలు, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ రచించిన 'నమో అదానీ -కరెంటు కహానీ' అనే బుక్ లెట్‌ను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యురాలు జి. బేబిరాణి ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ హిండెన్ బర్గ్ రిపోర్ట్ వచ్చినప్పుడే అదానీ సంస్థలపై విచారణ జరిపించి ఉండాల్సిందన్నారు. దేశ సంపదను అదానీకి కట్టబెట్టడమే ధ్యేయంగా మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. అమెరికాలో అదానీ కంపెనీపై కేసు నమోదు అయిన తరువాత కూడా పాలకుల మౌనం వహించడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. జగన్ హయాం లో అదానీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేయడానికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. స్మార్ట్ మీటర్ల పేర్లుతో ప్రజలపై స్మార్ట్‌గా విద్యుత్ భారాలు మోపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఈ బుక్ లెట్ ను చదివి చైతన్య వంతులై పాలకులను ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు సిహెచ్. రాజ్‌కుమార్, మలక వెంకట రమణ, చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. బుక్ లెట్ కొరకు కచేరిపేట సుందరయ్య భవన్‌లో గాని, 9490098974, 9553804358 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.




బుక్ లెట్‌ను అవిష్కరిస్తున్న రాజశేఖర్, బేబిరాణి, తదితరులు

# పలుచోట్ల రెవెన్యూ సదస్సులు



ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. భూ సమస్యలపై పలువురు అధికారులకు అర్జీలు అందించారు. **పెరవలి** గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్‌డిఒ రాణి సుస్మిత పాల్గొని మాట్లాడారు. ఈ రెవెన్యూ సదస్సులు రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా భూ సమస్యలను ఈ సదస్సుల్లోనే పరిష్కరించుకునే వెసులుబాటు ఉందన్నారు. రైతు నాగిరెడ్డి వరప్రసాద్ వారసత్వ భూమికి సంబంధించిన ఆన్‌లైన్ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.అచ్యుతకుమారి, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **చాగల్లు** మండలం ఊనగట్లలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట వెంకటరావు, డిటి శ్రీనివాస్ ఆర్ఐ ఎస్‌కె.కమల్, సబ్ రిజిస్ట్రార్ గుమస్తా శ్రీనివాస్, ఎండోమెంట్ ఆఫీసర్ గెల్లా సోమరాజు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** మండలం యాదవోలులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో భూ సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. భూ వివాదాలకు సదస్సుల్లో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మొత్తం 11 అర్జీలు వచ్చాయన్నారు. **రాజానగరం** మండలం పాత తుంగపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్‌డిఒ కృష్ణనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదికగా ఉన్నాయన్నారు. ఈ సదస్సుల్లో వస్తున్న ప్రతి అర్జీనీ పిజిఆర్ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. అధికారులను జవాబుదారీగా చేస్తూ చర్యలు తీసుకున్నామని చెప్పారు. మొత్తం నాలుగు అర్జీలు స్వీకరించామన్నారు. రెవెన్యు సదస్సుల్లో రికార్డులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్,రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

రాష్ట్రంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కూటమి నాయకులతో కలిసి స్థానిక వాలు తిమ్మా పురం రహదారిలోని టిడ్కో గృహ సముదా యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనతో మాట్లాడారు. కాలనీలో పిచ్చి మొక్కలు పెరిగిపోయా యన్నారు. గుమ్మాలు, కిటికీలు చెదలు పడుతున్నాయని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అనేక గృహాలకు విద్యుత్ సదుపాయం సైతం లేక చీకటి పడితే కాలనీలో తిరగడానికి భయపడు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఛైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కాలనీవా సులు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించేందుకు కృషి చేస్తామ న్నారు. గత వైసిపి ప్రభుత్వం టిడ్కో కాలనీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభు త్వం కాలనీలను అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అలాగే సామర్లకోట- పిఠాపురం రోడ్లో ఉన్న టిడ్కో గృహాల సముదాయాలను టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కాలనీలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన టిడ్కో గృహ సము దాయాలు వద్ద మౌలిక వసతులను మెరుగుపరిచి 100% లబ్ధిదారులు ఇళ్లలో చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగ నాగ్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్య దర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యార్లగడ్డ రవిచం ద్రప్రసాద్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.



# గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మంగళ వారం ఆకస్మిక తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇన్వెస్టిగేషన్ కేసులు, వాటి సంబం ధించి రికార్డును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై అన్ని విద్యాసంస్థల్లో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళా చట్టాలు, మహిళల స్వీయ భద్రతకు తీసుకోవాలసిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యచరణతో బ్లాక్ స్పాట్ గుర్తించడం, స్టాపర్స్ ఏర్పాటు చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం తదితర కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డును పరిశీలించి ఎస్సైకి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారిని మర్యాదపూర్వకంగా చూసి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ పి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

# నిబంధనల ప్రకారమే పాలన..!

## -ఉద్యోగులకు మింగుడు పడని ఇఒ ఆదేశాలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానంలో నిబధనల ప్రకారమే పరిపాలన సాగాలని ఇఒ వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు దేవస్థానంలోని కీలక విభాగాలకు చెందిన ఉద్యోగులకు మింగుడు పడటం లేదు. దేవస్థానంలో పాలన, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా విభాగాల నుంచి ఏ ఫైల్ అయిన ముందుగా గుమస్తా నుంచి ప్రారంభం కావాలని ఇఒ ఆదేశాలు జారీ చేశారు. అక్కడ నుంచి సూపరిండెంట్, ఎఇఒ, ఎసి, డిసి స్థాయి వరకూ ఆ ఫైల్‌ను పరిశీలించి తరువాత ఫైనల్‌గా ఇఒకి రావాలనేది నిబంధన. ఆ రీతిలో ఫైల్ రావడంతో ప్రతీ ఒక్క విభాగం అధికారికి .జవాబీదారీతనం, పాదర్శకత ఉండేందుకు అవకాశం ఉంటుందనేది భావన. అయితే ఇప్పటి వరకూ విధులు నిర్వర్తించిన కొందరు అధికారులు రెండు, మూడు ఫైల్స్ మాత్రమే ఎసి, డిసికి పంపించాలని, కీలక విభాగాల ఫైల్స్ అన్ని నేరుగా తనకే పంపించాలని సంబంధిత నిబంధనలను పక్కన పెట్టేశారు. దీంతో ఎసి, డిసి స్థాయి అధికారులు ఉత్సవమూర్తులుగా మిగిలిపోయేవారు. దీనికితోడు జవాబిదారీతనం, పారదర్శకత లోపించి అనేక అక్రమాలకు ఆస్కారం ఉండేదని పలువురు నుంచి విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇఒగా నూతనంగా బాధ్యతలు స్వీకరిం చిన వీర్ల సుబ్బారావు గతంలో జరిగిన పాలనాతీరును పరిశీలించి ఆ విధానానికి స్వస్తి పలికారు. ఇకపై వివిధ విభాగాల నుంచి ప్రతి ఫైలు ప్రొసీజర్ ప్రకారం నిబంధనలు అనుసరించి ఫైల్ తన వద్దకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలతో కీలక విభాగం అధికారులకు మింగుడు పడకుండా పోయింది. అయితే దిగువ శ్రేణి అధికారులు, సిబ్బంది ఈ ఆదేశాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.









## ఇంధన పొదుపుపై పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం యర్నగూడెం గవర్నమెంట్ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు విద్యుత్ పొదుపుపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించామని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ.సురేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఇంధనపొదురు వారోత్సవాలు ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

## 4వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

వేగేశ్వరపురం గ్రామంలో గల అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం నాలుగు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఐదు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెరవలి

కాకరపర్రు గ్రామంలో ఉపాధి నిధులు రూ.8.5 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సంగీత నాగు, పి.మధు, శేషగిరి, సంగీత జయరాజు, సీతారామయ్య పాల్గొన్నారు.